సాక్షి విశాఖపట్నం

బుధవారం ၊ 10 ၊ జనవరి ၊ 2024

న్యూస్‌రీల్

పోర్టును సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌ల బృందం



పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబేతో ట్రైనీ ఐఏఎస్‌లు

విశాఖ సిటీ: భారత్ దర్శన్‌లో భాగంగా 2022 ట్రైనీ ఐఏఎస్ అధికారుల(బ్యాచ్–3) బృందం మంగళవారం విశాఖ పోర్టు అథారిటీని సందర్శించింది. పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబే బృందానికి స్వాగతం పలికారు. జాతీయంగా కీలకమైన మెరైన్, లాజిస్టిక్స్ సెక్టార్‌లో మౌలిక వసతులపై అవగాహన కోసం ఈ బృందం పోర్టును సందర్శించింది. ఈ సందర్భంగా పోర్టులో జరిగే కార్యకలాపాలు, ఇక్కడి మౌలిక వసతులు, సాంకేతికత, కాలుష్య స్థాయిలు, వాణిజ్య అభివృద్ధిలో పోర్టు పాత్ర వంటి అంశాలను ట్రైనీ ఐఏఎస్‌లు పరిశీలించారు. పోర్టులో జరుగుతున్న ఎగుమతులు, దిగుమతులు, సరుకు రవాణా సామర్థ్యం, ఆధునికీకరణ, యాంత్రీకరణ, కవర్డ్ స్టోరేజ్ వసతులు, సోలార్ పవర్ ప్లాంట్, సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, పెట్టుబడి అవకాశాలు, ఇటీవలే అభివృద్ధి చేసిన అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్, ట్రక్ పార్కింగ్ టెర్మినల్, ఎగుమతులు దిగుమతులకు ఉన్న అవకాశాలను పోర్టు డిప్యూటీ చైర్మన్‌తో పాటు వివిధ విభాగాల అధిపతులు వివరించారు.

అప్పన్న దేవస్థానానికి రూ.4.15 లక్షల విరాళం



ఏఈవో నరసింగరావుకి చెక్కు అందజేస్తున్న దాత గురునాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మంగళవారం మాధవధార ప్రాంతానికి చెందిన ఎస్.గురునాథరావు రూ.3.15 లక్షలు, గోసంరక్షణ పథకానికి లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. మొత్తం 4.15లక్షల విరాళాన్ని చెక్కురూపంలో అన్నప్రసాద పథకం ఏఈవో పాలూరి నరసింగరావుకి అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు స్వామి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే గుర్తింపు రద్దు

ఆర్జేడీ జ్యోతి కుమారి

విశాఖ విద్య: సంక్రాంతి సెలవుల్లో తరగతులు నిర్వహించే స్కూళ్ల గుర్తింపు రద్దు చేస్తామని విద్యాశాఖ ఆర్జేడీ ఎం.జ్యోతి కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా క్యాలెండర్ మేరకు ఈ నెల 18 వరకు ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఇవ్వాల్సిందేనన్నారు. నిబంధనలు అతిక్రమించినట్లు తెలిస్తే, సంబంధిత పాఠశాలల గుర్తింపు రద్దుతో పాటు, యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు. ఈ విషయంలో డీఈవో, డిప్యూటీ డీఈవో, ఎంఈవోలు తగిన దృష్టి పెట్టాలన్నారు.

11న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

మహారాణిపేట: జిల్లా పరిషత్ ప్రజా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు ఈ నెల 11న నిర్వహిస్తున్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన నిర్వహించే సమావేశాలకు ప్రజా ప్రతినిధులందరికీ ఆహ్వానాలు పంపినట్లు జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు తెలిపారు. 11న ఉదయం 10 గంటలకు స్థాయీ సంఘాల సమావేశాలు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. 10 గంటలకు రెండో స్థాయీ సంఘం, 10.30 గంటలకు 5వ స్థాయీ, 12 గంటలకు 4, 6వ స్థాయీ సంఘాలు, మధ్యాహ్నం 3 గంటలకు 1, 3, 7వ స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సమగ్ర ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని అధికారులను సీఈవో సూచించారు.

1,859 మందికి వైద్య పరీక్షలు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు మంగళవారం జిల్లాలో మూడు ప్రాంతాల్లో నిర్వహించారు. భీమిలి మండలం పరిధిలో లక్ష్మీపురంలో, ఆనందపురం మండలంలో తర్లువాడ, పద్మనాభం మండలంలో బి.ఆర్తాళ్లవలస ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. మూడు వైద్య శిబిరాల్లో 1,859మందికి పరీక్షలు నిర్వహించామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. బుధవారం నగరంలో 12 చోట్ల వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

మహా బడ్జెట్ రూ.5614.22 కోట్లు

కౌన్సిల్ ఆమోదం

- 2024-25 ఏడాదికి ప్రారంభ నిల్వ రూ.664.33 కోట్లు
- అన్ని పద్దుల కింద జమ రూ.4,949.89 కోట్లు
- ప్రారంభ నిల్వతో కలిపి మొత్తం జమ రూ.5,614.22 కోట్లు
- అన్ని పద్దుల కింద ఖర్చులు రూ.5,457.23 కోట్లు
- ముగింపు నిల్వ రూ.156.99 కోట్లు
- ప్రతి వార్డులో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులకు గ్రీన్‌సిగ్నల్
- మేయర్ గొలగాని హరివెంకటకుమారి వెల్లడి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, చిత్రంలో డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, కార్పొరేటర్లు



కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 2024–25 వార్షిక బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన బడ్జెట్ సమావేశం మంగళవారం జరిగింది. మేయర్ ప్రసంగించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ప్రతిపక్షాలు పోడియంను చుట్టుముట్టి గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నించాయి. మేయర్ స్పందిస్తూ ఇది బడ్జెట్ ప్రత్యేక సమావేశం... కేవలం బడ్జెట్‌కు సంబంధించిన అంశాలు మాత్రమే గౌరవ సభ్యులు మాట్లాడాలని సూచించారు. సమావేశం అయిన వెంటనే అన్ని పార్టీల ఫ్లోర్‌లీడర్లతో తన చాంబర్‌లో సమస్యలపై మాట్లాడతానని హామీనిచ్చారు. దీంతో ప్రతిపక్ష సభ్యులు ఎవరి సీట్లకు వారు వెళ్లిపోయారు. మెజార్టీ సభ్యుల అభీష్టం మేరకు మేయర్ బడ్జెట్‌ను ఆమోదిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

2024–25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనా సంగ్రహంగా ప్రారంభ నిల్వ రూ.664.33 కోట్లు. అన్ని పద్దుల కింద జమ రూ.4,949.89 కోట్లు. ప్రారంభ నిల్వతో కలిపి మొత్తంగా జమ రూ.5,614.22 కోట్లు కాగా.. అన్ని పద్దుల కింద ఖర్చులు రూ.5457.23 కోట్లు. ముగింపు నిల్వ రూ.156.99 కోట్లుగా నిర్ణయించినట్టు చెప్పారు. ఏ ఏ రంగానికి ఎంతెంత కేటాయించారో మేయర్ వివరించారు. ప్రతి వార్డులో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

ఆదాయం ఇలా..

2024–25 సంవత్సరానికి ఆదాయంలో సాధారణ జమల కింద రూ.1,898 కోట్లు, మూలధన జమల కింద రూ.3,051.87 కోట్లు. మొత్తంగా రూ.4,949.89 కోట్లుగా చూపారు. అన్ని పద్దుల కింద ప్రారంభ నిల్వతో కలిపి రూ.5,614.22 కోట్లు జమగా ఆశించారు.

పన్నులు ఇలా..

జీవీఎంసీ వసూలు చేస్తున్న ఇంటిపన్ను, ఖాళీ జాగాపన్ను, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సర్వీసు చార్జీలు, స్టీల్‌ప్లాంట్, పోర్టు తదితర పారిశ్రామిక సంస్థలు చెల్లించాల్సిన పన్నులు, సర్వీసు చార్జీలు, ప్రకటన చార్జీలు, సెల్‌టవర్స్ చార్జీలు, జంతువులపై పన్ను తదితర ఈ పద్దు కింద 2024–25 ఏడాదికి రూ.66.55 కోట్లుగా చూపారు.

పన్నులు కాని ఇతర ఆదాయాలు

నీటి సరఫరా చార్జీలు, పట్టణ ప్రణాళికా విభాగం వసూళ్లు, షాపురూముల అద్దెలు, కల్యాణ మండపాల అద్దెలు, లీజులు, బల్క్, సెమీబల్క్, ఇతర నీటి సరఫరా చార్జీలు, వ్యాపార సంస్థల లైసెన్స్ ఫీజులు తదితరవి 2024–25 ఏడాదికి రూ.99.94 కోట్లుగా చూపారు.

ప్రభుత్వం నుంచి వచ్చే ఆదాయం

స్టాంప్ డ్యూటీపై సర్‌చార్జ్, వృత్తిపన్ను, తలసరి గ్రాంటు, మోటారువాహనాల పన్ను, ఆస్తిపన్ను రాయితీ నష్టపరిహారం, మెజిస్టీరియల్ జరిమానాలు తదితరవి ప్రభుత్వం నుంచి వచ్చే ఆదాయంగా 2024–25 ఏడాదికి రూ.23.30 కోట్లుగా బడ్జెట్‌లో చూపారు.

బ్యాంకులు/ఆర్థిక సంస్థలు/బాండ్ల ద్వారా రుణాలు

జీవీఎంసీ జోన్–2 మధురవాడ ప్రాంతంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ అభివృద్ధికి, స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా పెందుర్తి, గాజువాక, మల్కాపురం భూగర్భ మురుగు నీటి వ్యవస్థ అభివృద్ధికి జీవీఎంసీ సహకారం కోసం అవసరమైన వాటా సొమ్మును 2024–25 ఏడాదికి రూ.74.80 కోట్లు బ్యాంకులు/ఆర్థిక సంస్థలు/బాండ్లు/ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రుణం తీసుకోనున్నారు.



మాట్లాడుతున్న మేయర్ హరి వెంకటకుమారి

ఖర్చుల అంచనాలు

మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధిదీపాలు, రోడ్లు, ఫ్లైఓవర్లు, కాలువలు, భూగర్భ డ్రైనేజీ, పార్కులు, భవనాలు, కల్యాణ మండపాలు, ఆడిటోరియంలు, స్టేడియంల నిర్వహణ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు, అన్ని వార్డుల్లో చేపట్టాల్సిన పనుల ప్రతిపాదల అమలుకు వివిధ పద్దుల కింద బడ్జెట్ కేటాయించారు. 2024–25కి బడ్జెట్ అంచనాల్లో అన్ని పద్దుల కింద రూ.5,457.23 కోట్లు అంచనా వేశారు. గతంలో చేపట్టి, పూర్తి కాని పనులు, ప్రస్తుతం సంవత్సరంలో మంజూరైన పనులు, జరుగుతున్న పనులకు సవరించిన అంచనాలు, బడ్జెట్ అంచనాలలో తగు కేటాయింపులు చేశారు.

ఆధునిక విద్యుద్దీకరణకు..

నగరంలో ప్రధాన, సాధారణ రహదారుల్లో ఆధునిక విద్యుద్దీకరణకు రూ.20 కోట్లు, వీధి దీపాల నిర్వహణకు రూ.40 కోట్లు, పార్కుల విద్యుద్దీకరణకు రూ.10 కోట్లు కేటాయించారు.

మంచినీటి సరఫరాకు..

నగరంలో మంచినీటి సరఫరా పథకాల నిర్వహణకు రూ.40 కోట్లు, మంచినీటి సరఫరా పైపులైన్ల విస్తరణకు రూ.90 లక్షలు, గొట్టపు బావులు వేసేందుకు, నిర్వహణకు రూ.13.75 కోట్లు కేటాయించారు. రిజర్వాయర్ల నిర్మాణం, నిర్వహణకు రూ.15 కోట్లు కేటాయించగా, అమృత్ ప్రాజెక్టుకు రూ.51.20 కోట్లు, ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టు(ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ప్రాజెక్టు)కు రూ.90 కోట్లు, కార్బన్ తీవ్రత నివారించేందుకు యూసీటీఆర్‌ఎఫ్ (అర్బన్ క్లైమేట్ ఛేంజ్ రెసైలెన్స్ ట్రస్ట్ ఫండ్) ప్రాజెక్టు ద్వారా స్వాపింగ్ స్టేషన్స్, ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుకు రూ.15 కోట్లు కేటాయించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల పనుల కోసం సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.37.24 కోట్లు ప్రతిపాదించారు. ముడసర్లోవ రిజర్వాయర్, పార్క్ అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించగా, నగర పాలక సంస్థకు అవసరమైన భూసేకరణకు రూ.30 కోట్లు కేటాయించారు.

ఇంజినీరింగ్ పనులు ఇలా..

- జోన్–2 మధురవాడ ప్రాంతంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ అభివృద్ధికి రూ.55.30 కోట్లు కేటాయించారు.
- ఇంటిగ్రేటెడ్ జీవీఎంసీ కార్యాలయ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.80 కోట్లు కేటాయించారు.
- ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అభివృద్ధికి రూ.45 కోట్లు కేటాయించారు.
- ఆధునిక బస్ షెల్టర్ల నిర్మాణానికి రూ.10 కోట్లు, రోడ్ల నిర్వహణ, గుంతలు పూడ్చడం కోసం రూ.16 కోట్లు, నగరంలో మురుగు నీటి కాలువనిర్మాణం, నిర్వహణకు రూ.11.50 కోట్లు కేటాయించారు. సామాజిక భవనాల నిర్మాణానికి, నిర్వహణకు రూ.61 కోట్లు, వైఎస్సార్ క్లినిక్స్ నిర్మాణం, నిర్వహణకు రూ.13 కోట్లు, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.10.50 కోట్లు, తారురోడ్ల నిర్మాణానికి రూ.10కోట్లు, మున్సిపల్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, నిర్వహణకు రూ.5.70 కోట్లు కేటాయించారు.

విద్యా విభాగానికి ఇలా...

బాల్యం పథకం కింద 3 నుంచి 7 ఏళ్లలోపు బాలలకు చిన్నబడి కార్యక్రమం కింద అంగన్వాడీ కేంద్రాలతో మున్సిపల్ పాఠశాలలు అనుసంధానం చేసి పౌష్టికాహారం, విద్య, క్రీడా సదుపాయాలు కల్పించేందుకు రూ.2 కోట్లు, జీవీఎంసీలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు, ప్రసూతి సెలవులు పూర్తయిన తర్వాత నెలల వయసు ఉన్న తమ శిశువులను ఉంచేందుకు వీలుగా ఏర్పాటుచేసిన శిశు సంరక్షణ కేంద్రం (సీఆర్‌ఈసీహెచ్) నిర్వహణకు రూ.50 లక్షలు, ఉద్యానవనం విభాగానికి సంబంధించి ప్రధాన, సాధారణ, కాలనీ పార్కులు, ట్రాఫిక్ ఐల్యాండ్స్, సెంట్రల్ మీడియన్, వర్టికల్, రూఫ్ గార్డెన్స్ నిర్వహణ,అభివృద్ధికి రూ.16.23 కోట్లు, వర్టికల్, రూఫ్‌గార్డెన్స్ నిర్వహణ, అభివృద్ధికి రూ.6.50 కోట్లు, మియావాకీ అడవుల నిర్వహణ, అభివృద్ధికి రూ.12.50 కోట్లు కేటాయించారు. ప్రజారోగ్యం విభాగానికి సంబంధించి రూ.95 కోట్లు కేటాయించారు. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, స్త్రీ, శిశు సంక్షేమం కోసం 5 శాతం అభివృద్ధి పనులకు కేటాయించిన నిధుల్లో మొత్తం 27.5 శాతంకు తగ్గకుండా రూ.19.29 కోట్లు కేటాయించారు. సమావేశంలో ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంకల్ప యాత్ర ఓ చారిత్రక ఘట్టం



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఉత్తర సమన్వయకర్త కేకే రాజు, పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి రవిరెడ్డి తదితరులు

- ఐదేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా వేడుకలు
- పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు

కొమ్మాది: ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర ఓ చారిత్రక ఘట్టమని వైఎస్సార్‌సీపీ నేతలు పేర్కొన్నారు. ప్రజా సంకల్పయాత్ర ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం ఎండాడలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఉత్తర సమన్వయకర్త కేకే రాజు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోలా గురువులు మాట్లాడుతూ సంకల్పయాత్రలో జనం కష్టాలు, కన్నీళ్లు దగ్గరుండి చూసిన జగన్..అధికారం చేపట్టాక నవరత్నాలతో అండగా నిలబడ్డారన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన గొప్ప పాలకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. రాష్ట్రంలో పోర్టులు, వైద్య కళాశాలలు, భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయన్నారు. ఎక్కడ చూసినా సంక్షేమం.. అభివృద్ధి కనిపిస్తోందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఉత్తర సమన్వయకర్త కేకే రాజు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్ని రంగాలు అవినీతిలో కూరుకుపోయాయన్నారు. బడుగుబలహీన వర్గాలను చంద్రబాబు నాయుడు అణగదొక్కారన్నారు. అమరావతి భ్రమలో పడి చంద్రబాబు రాష్ట్రాభివృద్ధిని మరిచిపోయాడన్నారు. అలాంటి తరుణంగా ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు ఆనాడు జనసైనికుడిగా జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర ప్రారంభించి, అనంతరం అధికారంలోకి వచ్చారన్నారు. నాటి నుంచి పేదల దశ మారిందని, సంక్షేమ పథకాలతో సీఎం జగన్ ఎన్నో కుటుంబాలను ఆదుకున్నారన్నారు. పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి రవిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, చైర్మెన్లు పిల్లా సుజాత, పేడాడ రమణకుమారి, ద్రోణంరాజు శ్రీవాత్సవ, ముందుండి రాజేశ్వరి, నడింపల్లి కృష్ణంరాజు, మాధవి వర్మ, ఎ.రాజబాబు, పద్మావతి, దాసరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారం అవసరం



అన్ని పార్టీల ఫ్లోర్‌లీడర్లతో సమీక్ష నిర్వహిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

అన్ని పార్టీల ఫ్లోర్‌లీడర్లు, జీవీఎంసీ పర్మినెంట్ పారిశుధ్య కార్మికులకు మేయర్ విజ్ఞప్తి

డాబాగార్డెన్స్: రాష్ట్ర వ్యాప్తంగా పారిశుధ్య కార్మికులు, తాగునీటి విభాగం సిబ్బంది సమ్మెలో పాల్గొన్నందున నగర ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లు, కార్పొరేటర్లు సహకరించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి విజ్ఞప్తి చేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరి సతీష్, అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో కలిసి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది లేకుండా జీవీఎంసీ పర్మినెంట్ పారిశుధ్య సిబ్బందిచే పారిశుధ్య నిర్వహణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రైవేట్ వాహనాలు, జీవీఎంసీకి చెందిన వాహనాలతో పారిశుధ్య వ్యర్థాలు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం సానుకూల వాతావరణంలో కార్మికులతో చర్చలు జరుపుతున్నందున అవి ఫలప్రదమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు, టీడీపీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు, జనసేన ఫ్లోర్‌లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి, బీజేపీ ఫ్లోర్‌లీడర్ కవిత, సీపీఐ ఫ్లోర్‌లీడర్ స్టాలిన్, సీపీఎం ఫ్లోర్‌లీడర్ల బి.గంగారావు పాల్గొన్నారు.

ఉపాధి ఆధారిత శిక్షణకు ప్రాధాన్యం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న సంస్థ ప్రతినిధులు, చిత్రంలో శ్రీధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సెక్రటరీ సురేష్‌కుమార్ తదితరులు

మురళీనగర్/మద్దిపాలెం : పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మానవ వనరులను తీర్చిదిద్దడమే ధ్యేయంగా చర్యలు తీసుకున్నామని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ సమీపంలోని ఒక హోటల్‌లో మంగళవారం నిర్వహించిన ఇండస్ట్రీ స్టాక్ హోల్డర్స్ వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. పరిశ్రమలకు అనుగుణంగా మానవ వనరులను సిద్ధం చేసేందుకు ఇప్పటికే స్కిల్స్ క్యాస్కేడింగ్ ఎకోసిస్టమ్‌ను స్వీకరించినట్లు వివరించారు. పరిశ్రమ ప్రాంగణంలో విద్యార్థులకు శిక్షణతోపాటు ఇండస్ట్రీ కస్టమైజ్డ్ స్కిల్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్ (ఐసీఎస్‌టీపీ)ను అమలు చేస్తున్నామన్నారు. జాబ్ ఫెయిర్ అండ్ శిక్షణ విభాగం ప్రభుత్వ సలహాదారుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్ ద్వారా ప్రతి జిల్లాలో ప్రతి నెల రెండు జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 45,000 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు వివరించారు. రానున్న కాలంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసే యోచన ఉందన్నారు. ఏపీ ఎస్ఎస్‌డీసీ సీఈవో డాక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇండస్ట్రీ కస్టమైజ్డ్ స్కిల్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్ (ఐసీఎస్‌టీపీ)ను అమలు చేసేందుకు మార్గదర్శకాలు ఇచ్చామన్నారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికను పరిశ్రమల ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా రిటైల్ స్కిల్ సెక్టార్ అసోసియేషన్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంస్థతో శిక్షణ కోసం అవగాహన ఒప్పందం జరిగింది. ఆర్ఏఎస్‌సీఐ ఎగ్జిక్యూటివ్ హెడ్ జేమ్స్ రాఫెల్ ఒప్పంద పత్రంపై సంతకం చేశారు. మొదటి దశలో 500 మంది యువత కోసం డీఎల్ఐసీ కార్యక్రమాన్ని అమలు చేస్తామని సంస్థ ప్రకటించింది. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, ఏపీఎస్ఎస్ డీసీ అండ్ న్యాక్ ఈడీ కె.దినేష్ కుమార్, ఐటీఏపీ హెడ్ లక్ష్మి, ఇండస్ట్రియల్ కంపెనీస్‌కు సంబంధించిన 124 మంది హెచ్ఆర్ డిపార్టుమెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంతమంది కలిసి వచ్చినా వైఎస్సార్ సీపీదే విజయం

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



సభకు హాజరైన వలంటీర్లు, సచివాలయ సిబ్బంది



సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

మధురవాడ: ఎంతమంది కలిసి వచ్చినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంకల్ప యాత్రకు ఐదేళ్లు పూర్తి కావడంతో మంగళవారం జీవీఎంసీ 6వ వార్డు అవంతి ఫంక్షన్ హాల్‌లో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి ప్రజల వద్దకు పాలన అందిస్తున్న గొప్ప నాయకుడు జగన్ అని పేర్కొన్నారు. కరోనా క్లిష్ట సమయంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఎంతో విలువైన సేవలు అందించారన్నారు. టీడీపీ, జనసేన నాయకులు మైండ్ గేమ్ ఆడుతూ తాను ఎంపీగా పోటీ చేస్తానని, పార్టీ మారిపోతానని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రంలోనే విజయవంతంగా నిర్వహించింది తానేనన్నారు. భీమిలీలో మళ్లీ ఎగిరేది వైఎస్సార్‌సీపీ జెండాయేనన్నారు. పవన్ కల్యాణ్ అవగాహన లేక వలంటీర్లు, సచివాలయ వ్యవస్థను విమర్శిస్తే.. చంద్రబాబు వారిపై నిత్యం విషం చిమ్ముతున్నాడన్నారు. వైఎస్సార్ సీపీలో ఆర్పీసీ బెర్తులు కూడా ఖాళీలేవని, అందుకే కొందరు పార్టీని వీడుతున్నారన్నారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు, ఆర్పీలకు దుస్తులు పంపిణీ చేశారు. రాష్ట్ర క్రియేటివ్ అండ్ కల్చర్ కమిషన్ చైర్‌పర్సన్ వంగపండు ఉష మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ గెలుపును ఎవరూ ఆపలేరని, సింహం సింగిల్‌గానే వస్తుందని, పందులు మాత్రం గుంపులు గుంపులుగా వస్తాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు డాక్టర్ ముత్తంశెట్టి ప్రియాంక, లొడగల అప్పారావు, యువజన విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ ముత్తంశెట్టి నందేశ్, శ్రావణ్‌కుమార్, భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్తంశెట్టి మహేష్, వార్డు అధ్యక్షులు బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, గుడ్ల పోలిరెడ్డి, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, జేసీఎస్ కన్వీనర్‌లు డాక్టర్ గాదే రోశిరెడ్డి, కుడితి రామారావు, చెన్నాదాసు, లొడగల రామ్మోహన్, అల్లాడ ఉమామహేశ్వరరావు, పోతిన ప్రసాద్, పోతిన ఎల్లాజీ, పిల్లా సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు

‘పశ్చిమ’లో ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



లక్ష్మీనగర్ ఈ బ్లాక్ ప్రాథమిక పాఠశాలలో ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

గోపాలపట్నం: ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్నారు. మంగళవారం 40,58,59,60,61,6289,90,91,92వ వార్డుల్లో ముగ్గులు పోటీలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పోటీలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు పర్యవేక్షణలో పోటీలు అట్టహాసంగా జరిగాయి.

యోగాసనాల్లో కొత్త చరిత్ర


యోగాసనాలు చేయిస్తున్న రమేష్

- ఓం శ్రీ యోగా సంస్థ వరల్డ్ రికార్డు
- రికార్డు స్థాయిలో సూర్యనమస్కారాలు
- బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు

ఎంవీపీకాలనీ: యోగాసనాల్లో ఓం శ్రీ యోగా సంస్థ సరికొత్త చరిత్ర సృష్టించింది. 216 రౌండ్లు, 108 రౌండ్లు కేటగిరిల్లో రికార్డు స్థాయిలో సూర్యనమస్కారాలు చేసింది. దీంతో ఈ సంస్థకు యోగాసనా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ద్వారా వరల్డ్ రికార్డ్ లభించింది. విశాఖలోని గాదిరాజు ప్యాలెస్ వేదికగా సెంటర్ వ్యవస్థాపకుడు చిలకా వెంకట రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉభయగోదావరి, హైదరాబాద్, ఉత్తరాంధ్రకు చెందిన యోగా అభ్యాసకులు పాల్గొని 88 నిమిషాల వ్యవధిలో 2,592 సూర్యనమస్కారాలు చేసి రికార్డు నెలకొల్పారు. 216 రౌండ్ల కేటగిరిలో 163 మంది, 108 రౌండ్ల కేటగిరిలో 107 మంది యోగాసనాలు పూర్తిచేశారు. యోగాసనా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధులు రికార్డు నమోదు చేసి చిలకా వెంకట రమేష్‌కు సర్టిఫికెట్ అందజేశారు. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములు కావడం పట్ల పలువురు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఆర్ఎస్ అధికారి శిఖాదర్బారి, ఇంటర్నేషనల్ కోచ్ డాక్టర్ సయ్యిద్ రఫీ, యోగాసనా వరల్డ్ రికార్డ్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్.పరాసర్, చీఫ్ ఎడిటర్ మల్విజ వాజ్పేయి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓం శ్రీ యోగ సెంటర్ వ్యవస్థాపకుడు చిలకా వెంకట రమేష్‌ను యోగాసనా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ఆంధ్రప్రదేశ్ హెడ్‌గా నియమించారు. సీఐ కల్యాణ్ సౌత్ జోన్ ప్రతినిధిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గుజరాత్‌లో ప్రధాని నరేంద్రమోదీ హాజరైన కార్యక్రమానికి యోగాసనాల వరల్డ్ రికార్డ్ ఉందన్నారు. ప్రస్తుతం తమ సంస్థ ఆ రికార్డ్‌ను అధిగమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన వారికి అభినందనలు తెలిపారు.

సంక్రాంతి 'ఫన్'డుగ..


పంచెకట్టు అదిరేటట్టు.. విద్యార్థి ఉత్సాహం


సంక్రాంతులు : వేడుకలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు


పండగొచ్చింది : సంక్రాంతి వంటలు వండుతున్న విద్యార్థిని

పండగంటే ముచ్చట్లు... మురిపాలు...బంధువులు. పిండి వంటలు... విందులు... వినోదాలు. అచ్చతెలుగు సంబరాల్లోని అసలుసిసలు మజా ఆస్వాదించారు ఏవీఎన్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు. రంగురంగుల ముగ్గులు, ఆ ముగ్గులపై గొబ్బెమ్మలు, భోగి మంట..ఆ మంట చుట్టూ నృత్యాలు.. అంతా ఒకే కుటుంబంగా... ఆనందంగా..సంప్రదాయబద్ధంగా ముందస్తుగా సంక్రాంతిని ఆహ్వానించారు. నగరంలో పల్లె సందడిని తీసుకొచ్చారు. పల్లెటూరు సెట్ వేసి..సంప్రదాయబద్ధంగా సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. –డాబాగార్డెన్స్

సంక్రాంతి పండగ విశిష్టత తెలుపుతూ ఏవీఎన్ కళాశాల విద్యార్థులు మంగళవారం మినీ సంక్రాంతిని ఉత్సాహంగా..ఉల్లాసంగా జరుపుకున్నారు. పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించేలా అలంకరించి సంక్రాంతి పండగ సమయంలో నిర్వహించే పలు కార్యక్రమాలు విద్యార్థులు.. అధ్యాపక.. అధ్యాపకేతర సిబ్బంది ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. చెరకు పంట ఇంటికి తీసుకురావడం, కొత్త పంటతో వంటకాలు..ధనుర్మాస వేళ హరిదాసు కీర్తనలు, పట్టు పరికిణీలతో అమ్మాయిల ముచ్చట్లు..శివ పార్వతుల ఊరేగింపుతో సందడి నెలకొంది. సంక్రాంతి పండగను కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు, ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు భోగి మంటలతో వేడుకలు ప్రారంభించారు. డూడూ బసవన్నలు..కొమర దాసు, హరిదాసుల సందడి ఆకట్టుకుంది. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి సంక్రాంతి సంబరాల్లో మునిగితేలారు. ఆట పాటలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, స్వరాజ్యలక్ష్మి, మీడియా కో ఆర్డినేటర్ పైడి రజని, కళాశాల తెలుగు విభాగాధిపతి గాయత్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.


భోగిభాగ్యాలు : భోగిమంట వద్ద విద్యార్థులు


పండగ సార్ : నృత్యం చేస్తున్న అధ్యాపకుడు


జోష్: నృత్యాలతో అలరిస్తూ..


సెల్ఫీ టైం : డూడూ బసవన్నతో తీపి జ్ఞాపకం

బహిరంగ ప్రకటన

[illegible]

పెద్యూలు ఆస్తి వివరములు

[illegible]

R. కృష్ణంరాజు, అడ్వకేట్, ఆర్.కె. లా ఛాంబర్స్, డోర్ నెం. 10-57/1, గణేష్ నగర్, గోపాలపట్నం, విశాఖపట్నం. ఫోన్ : 9848014809, 7981340526

కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం


మాట్లాడుతున్న జేడీ శీలం

సీతంపేట: కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెచ్చే విధంగా పతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం అన్నారు. స్థానిక పౌర గ్రంథాలయంలో ఉత్తరాంధ్ర కాంగ్రెస్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, కమిటీలు విస్తృతంగా పర్యటించి నాయకత్వం వహించే విధంగా ప్రతి ఒక్కరినీ ప్రోత్సహించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించనున్న ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల ముందు ఉంచి పార్టీ గెలుపు దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పోలవరం, ప్రత్యేక హోదా, స్టీల్ ప్లాంట్ అంశాలపై న్యాయం జరిగేలా కృషి చేయడం జరుగుతుందన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రరాజు, ఉత్తరాంధ్ర నాయకులు పాల్గొన్నారు.

సాధారణ చార్జీలతో రైట్‌రైట్

సంక్రాంతికి 250 ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు

డాబాగార్డెన్స్ : సంక్రాంతి పురస్కరించుకొని ఏపీఎస్ ఆర్టీసీ సాధారణ చార్జీలతోనే ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్టు ఏపీఎస్ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు పేర్కొన్నారు. మంగళవారం నుంచి 21వ తేదీ వరకు అదనంగా 250 బస్సులతో విజయవాడ, హైదరాబాద్, అమలాపురం, భీమవరం తదితర సుదూర ప్రాంత బస్సులతో పాటు విజయనగరం, రాజాం, పాలకొండ, పార్వతీపురం, శ్రీకాకుళం, సోంపేట, ఇచ్ఛాపురం, కాకినాడ, రాజమండ్రి తదితర ప్రాంతాలకు కూడా ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు చెప్పారు. ముందుగా రిజర్వేషన్ చేసుకునే ప్రయాణికులు ఆన్‌లైన్‌లో www.apsrtconline.in గానీ లేదా ముఖ్య కూడలిలో ఆర్టీసీకి సంబంధించిన ఏటీబీ ఏజెంట్ల వద్ద టికెట్లు రిజర్వ్ చేసుకోవచ్చని అప్పలరాజు తెలిపారు.

పది శాతం రాయితీ : రానుపోను టికెట్ ఒకేసారి బుక్ చేసుకున్న ప్రయాణికులకు చార్జీలో 10 శాతం రాయితీ కల్పించినట్టు ప్రజా రవాణా అధికారి తెలిపారు. సంక్రాంతి ప్రత్యేక బస్సుల్లో సాధారణ చార్జీలతోనే ప్రయాణించవచ్చని ఆయన తెలిపారు.

విశాఖ నుంచి హైదరాబాద్‌కు :	30 బస్సులు
విశాఖ నుంచి విజయవాడకు :	60 బస్సులు
విశాఖ నుంచి శ్రీకాకుళం, రాజాం, పాలకొండ, పార్వతీపురం, సోంపేట, బొబ్బిలి, పలాసకు :	100 బస్సులు
విశాఖ నుంచి అమలాపురం, భీమవరానికి :	10 బస్సులు
విశాఖ నుంచి రాజమండ్రికి :	25 బస్సులు
విశాఖ నుంచి కాకినాడకు :	25 బస్సులు

గరీబ్‌రథ్‌కు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం: పండగ వేళ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విశాఖ–సికింద్రాబాద్ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు తాత్కాలికంగా మూడు థర్డ్ ఏసీ కోచ్‌లను జతచేస్తున్నట్లు సికింద్రాబాద్ డివిజన్ రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్–విశాఖ(12740) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు బుధవారం నుంచి 16వ తేదీ వరకు తిరుగుప్రయాణంలో (12739) ఈ నెల 11 నుంచి 17 వరకు మరో మూడు థర్డ్ ఏసీ కోచ్‌లను జతచేస్తున్నారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన యువతికి అరుదైన చికిత్స

అక్కిరెడ్డిపాలెం: విశాఖ నగరానికి చెందిన 30 ఏళ్ల యువతి బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవ్వడంతో ఆమెను అత్యవసరంగా షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించడతో మామూలు స్థితికి వచ్చింది. ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ న్యూరాలజిస్టులు డాక్టర్ సీహెచ్.విజయ్, డాక్టర్ మానస, ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ వెంకటేష్ పోతుల తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇటీవల ఓ పెళ్లికి హాజరైన యువతి ఒక్కసారిగా స్ట్రోక్‌కు గురవ్వడంతో ఆమె చెయ్యి, కాలు, మాట పడిపోయాయి. ఇది అత్యంత అరుదైన టకయాసూస్ ఆర్టెరైటిస్ కావడంతో యువతి తీవ్ర ఇబ్బందులకు గురైంది. తక్షణం ఆమెను కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. యువతికి మెదడులో రక్తం గడ్డ కట్టినట్టు గుర్తించాం. వెంటనే ఇంజక్షన్లు ఇచ్చినా గడ్డ కరగకపోవడంతో మెకానికల్ థ్రాంబెక్టమీ ద్వారా గడ్డను కరిగించాం. 30 ఏళ్ల వయస్సులో ఎలాంటి రిస్క్ ఫ్యాక్టర్లు లేకుండా స్ట్రోక్ రావడం చాలా అరుదు. సకాలంలో సరైన వైద్యం అందించి యువతిని మామూలు స్థితికి తీసుకొచ్చామన్నారు. టకయాసూస్ ఆర్టెరైటీస్ అనేది 11 నుంచి 30 ఏళ్లలోపు మహిళలే ఎక్కువగా వస్తుందని వైద్యులు తెలిపారు.

అంబరం.. సాంస్కృతిక సంబరం


బహుమతులు ప్రధానం చేస్తున్న వీసీ సమత

ముగిసిన యువభేరి


కేరళ వర్సిటీ విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శన

ఏయూక్యాంపస్: సాంస్కృతిక సంబరం అంబరాన్నంటింది. నాలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన 19 విశ్వవిద్యాలయాల విద్యార్థులు పోటీపడి తమ సాంస్కృతిక ప్రతిభను ప్రదర్శించారు. ఆరు విభాగాలలో 26 అంశాలలో పోటీలను నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్ ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను మహాత్మగాంధీ యూనివర్సిటీ (కొట్టయాం) సాధించింది. ఐదు రోజులుగా జరుగుతున్న 37వ సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్ట్ (యునిఫెస్ట్ 2023–24) యువభేరి మంగళవారం ఘనంగా ముగిసింది. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ముగింపు వేడుకలకు ఏయూ ఇంచార్జి వీసీ ఆచార్య కె.సమత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైవిధ్య సంస్కృతులకు భారత్ నిలయమన్నారు. విద్యార్థులు సమగ్ర వికాసానికి, ప్రగతికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నాయన్నారు. ఏఐయూ అబ్జర్వర్ డాక్టర్ మనీష్ జంగ్ర మాట్లాడుతూ యువభేరి పేరును సార్థకం చేసే విధంగా కార్యక్రమాలను ఏయూ నిర్వహించిందన్నారు. ఏఐయూ తరపున ఏయూ అధికారులకు అభినందనలు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న 10 మంది విద్యార్థులకు బాలీవుడ్‌లో పాడే అవకాశాలు లభించాయన్నారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, కల్చరల్ కోఆర్డినేటర్ ఆచార్య ఎం.విజయ్ మోహన్, పాలక మండలి సభ్యురాలు ఆచార్య పి.సునీత, ఓఎస్‌డీ వి.కృష్ణమోహన్ ప్రిన్సిపాల్స్, డీన్‌లు, అధికారులు పాల్గొన్నారు.

సాంస్కృతిక ఉత్సవాలు భళా..... : ముగింపు ఉత్సవాల్లో భాగంగా యూనివర్సిటీ ఆఫ్ కేరళ విద్యార్థుల వాద్య విన్యాసం, కేఎల్ వర్సిటీ విద్యార్థులు, వీణ, గిటార్, డ్రమ్స్‌లో సినీ గీతాలను పలికించి అలరించిన తీరు, ఎం.జి వర్సిటీ, కేరళ వర్సిటీ, శకరాచార్య వర్సిటీ విద్యార్థులు సంయుక్తంగా అందించిన శాస్త్రీయ గాత్ర కచేరీలు యువత ప్రతిభకు తార్కాణాలుగా నిలిచాయి.

చైతన్య దీప్తి.. నిత్య స్ఫూర్తి అంబేడ్కర్

- జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్
- కోలాహలంగా సామాజిక సమతా సంకల్ప మహోత్సవ ర్యాలీ
- జన్‌భాగీధారి పేరిట మారథాన్
- జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు


రక్తదానం చేస్తున్న జేసీ విశ్వనాథన్


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జేసీ విశ్వనాథన్

విశాఖ విద్య: భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ అన్నారు. ఈ నెల 19వ తేదీన అమరావతిలోని స్మృతివనం ప్రారంభోత్సవం, 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ వంటి మహా క్రతువులను పురస్కరించుకొని జన్‌భాగీధారి పేరిట చేపట్టిన చైతన్య ర్యాలీని మంగళవారం ఆయన ప్రారంభించారు. నగరంలోని అంబేడ్కర్ జంక్షన్ నుంచి రామాటాకీస్ వద్దనున్న అంబేడ్కర్ భవన్ వరకు ర్యాలీ సాగింది. అంబేడ్కర్ విగ్రహానికి జిల్లా అధికారులు, వివిధ సామాజిక సంఘాల నాయకులతో కలసి జేసీ పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ అన్ని వర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి పాటు పడిన అంబేడ్కర్ అడుగుజాడల్లో నేటి యువత నడవాలన్నారు. అంబేడ్కర్ భావజాలాన్ని వ్యాప్తి చేయడంలో భాగంగా నిర్వహిస్తున్న జన్‌భాగీధారి చైతన్య కార్యక్రమాల్లో భాగస్వామ్యులైన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను జేసీ తిలకించారు.

జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు

నగరంలో అంబేడ్కర్ భవన్‌తో పాటు, వుడా చిల్డ్రన్ ఎరీనా, కేజీహెచ్, విక్టోరియా ఆస్పత్రుల్లో, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జేసీ విశ్వనాథన్, డీఆర్డీఏ పీడీ, డీపీవో, ఇతర అధికారులు రక్తదానం చేశారు. ప్రజలందరూ రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని జేసీ పిలుపునిచ్చారు. ఈ నెల 18న నిర్వహించనున్న ముగింపు ఉత్సవంలో అందరూ పాల్గోవాలన్నారు. రక్తదానం చేసిన పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, డీఆర్డీఏ పీడీ శోభారాణి, డీపీవో శ్రీనివాసరావు, డీఈవో చంద్రకళ, యూసీడీ పీడీ పాపునాయుడు, బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీదేవి, జీవీఎంసీ జేడీ శ్రీనివాసరావు, డీఎల్‌డీవో పూర్ణిమాదేవి, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, సాంఘిక సంక్షేమశాఖ సూపరింటెండెంట్ పవన్ కుమార్, వివిధ శాఖల అధికారులు, అంబేడ్కర్ అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖలో ఓటర్ల నమోదు ప్రక్రియపై ఎన్నికల సంఘం సంతృప్తి


విజయవాడలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్

మహారాణిపేట: ఓటర్ల నమోదు ప్రక్రియపై కలెక్టర్ మల్లికార్జున ఇచ్చిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌పై కేంద్ర ఎన్నికల సంఘం సంతృప్తి వ్యక్తం చేసింది. మంగళవారం విజయవాడలో కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఎన్నికల సన్నద్ధతపై నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ మల్లికార్జున, నగర పోలీసు కమిషనర్ డాక్టర్ ఏ. రవిశంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఓటర్ల నమోదుపై విస్తృత ప్రచారం నిర్వహించామన్నారు.

వెంటాడిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తల దుర్మరణం
- పోతిరెడ్డిపాలెం హైవే జంక్షన్ వద్ద ఘోర దుర్ఘటన


దొరబాబు, వీరవేణి (ఫైల్)

యలమంచిలి రూరల్/కిర్లంపూడి : రెండు దశాబ్దాలకు పైగా అన్యోన్యంగా వున్న ఆ దంపతులను చూసి విధి కన్నుకుట్టింది. కాసేపట్లో ఇంటికి చేరుకుని నిద్ర పోదామనుకున్న ఆ దంపతులను రాత్రి వేళలో మృత్యువు శాశ్వత నిద్రలోకి నెట్టింది. పోతిరెడ్డిపాలెం హైవే జంక్షన్ వద్ద సోమవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు దుర్మరణం చెందారు. వివరాలివి.. కాకినాడ జిల్లా కిర్లంపూడికి చెందిన ఏనుగు దొరబాబు (53), వీరవేణి (45) దంపతులు వ్యాపారం నిమిత్తం కొన్నేళ్ల కిందట విశాఖ వచ్చి కొమ్మాదిలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. రెండ్రోజుల క్రితం తమ కారులో విశాఖ నుంచి స్వ గ్రామం కాకినాడ జిల్లా కిర్లంపూడిలో ఉన్న దొర బా బు తల్లిదండ్రులను చూసిరావడానికి వెళ్లిన ఆ దంపతులు సోమవారం రాత్రి ఏడు గంటలకు తిరిగి కారులో విశాఖ బయల్దేరారు. రాత్రి 10 గంటల ప్రాంతంలో యలమంచిలి మండలం పోతిరెడ్డిపా లెం హైవే జంక్షన్ వద్ద బైక్‌పై రోడ్డు దాటుతున్న వ్యక్తి ని తప్పించబోయి కారు డివైడర్‌ను ఢీకొని అవత లి రోడ్డులో యలమంచిలి నుంచి తుని వైపు జిప్సం లోడుతో వెళ్తున్న లారీని ఢీకొట్టింది. డ్రైవింగ్ చేస్తున్న వీరవేణి అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె భర్త దొరబాబును పోలీసులు యలమంచిలి ఆస్పత్రి కి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు.

మార్చురీలో విగతజీవులుగా..: యలమంచిలి మార్చురీలో విగత జీవులుగా ఒకేచోట కన్పించిన దొరబాబు, వీరవేణి దంపతులను చూసి బంధువులు చలించారు.

ఆశలు అడియాసలు

దొరబాబు దుబాయ్‌లో, కాకినాడలో కొన్నాళ్లు ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగం చేశాడు. తన పిల్లల చదువుల కోసమని కొన్నేళ్లుగా విశాఖపట్నం జిల్లా కొమ్మాదిలో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమారులున్నారు. తమ పిల్లలకు ఉన్నత భవిష్యత్తును ఇవ్వాలనే సంకల్పంతో నిత్యం కష్టపడుతూ వారిని ఆ దంపతులు చదివించుకున్నారు. తల్లిదండ్రులు ఆశించిన విధంగానే పెద్ద కుమారుడు బాగా చదివి కోల్‌కతాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరాడు. చిన్న కుమారుడు కూడా సీఏ పూర్తి చేసుకుని మంచి ఉద్యోగం సాధిస్తాడని మురిసిపోతున్న సమయంలో ఆ దంపతులను మృత్యువు కాటేసింది. కుమారులు అందివస్తున్న సమయంలో ఇద్దరూ దుర్మరణం పాలవడాన్ని కుటుంబీకులు, బంధువులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆనందంగా నవ్వుతూ వెళ్లిన వారు విగత జీవులుగా మంగళవారం ఇంటికి చేరుకోవడం బంధువులను, గ్రామస్తులను కలచివేసింది.